క్లుప్తంగా

ఆటోలపై కేసులు నమోదు

మద్దిపాడు: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోలపై ఆదివారం కేసులు నమోదు చేసినట్లు మద్దిపాడు ఎస్సై శ్రీరామ్ తెలిపారు. ముఖ్యంగా ఉదయాన్నే పచ్చాకు పొలం పనులకు వెళ్లే కూలీల ముఠాలను ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కించుకుంటున్నారని కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రయాణికులను అధికంగా ఎక్కించుకుంటున్న ఆటోలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ముఠాల కూలీలు కూడా ఎక్కువ సంఖ్యలో ఎక్కకుండా పరిమితంగా ఆటోల్లో ఎక్కాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జన్మదినం



విద్యార్థులకు ఫైల్స్ బహూకరిస్తున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్

ఒంగోలు: లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని స్థానిక కర్నూలు రోడ్డులోని గుడ్ న్యూస్ అంధుల పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ బ్రెయిలీ లిపి కనిపెట్టి అంధ విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకునేలా చేశారన్నారు. అంధులంతా ఆత్మస్థైర్యంతో మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ఫైల్స్, పండ్లతో పాటు మాంసాహార భోజనాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, షేక్ అల్లాభక్షు, సయ్యద్ మున్నా, స్వర్ణ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి రామతీర్థంలో అన్నదానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: రామతీర్థంలోని శ్రీయోగి వేమన రెడ్ల సత్రంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేయాలని సత్రం అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి నిర్ణయించారు. ఆదివారం రామతీర్థంలోని శ్రీయోగి వేమన రెడ్ల సత్రంలో సత్రం కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా రామతీర్థంలోని శ్రీమోక్షరామలింగేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాల సందర్శనార్థం వచ్చే భక్తులకు అన్నదానం చేయాలని తీర్మానించారు. అన్నదాన కార్యక్రమానికి సత్రంలోని కమిటీ సభ్యులు తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, సంగన బక్కిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి విప్లవం

- కొత్తపట్నం మండలంలోని 15 పంచాయతీలకు జలజీవన్ మిషన్ పథకం
- రూ.18.70 కోట్లతో 19,262 గృహాలు లక్ష్యం
- ఇప్పటి వరకు ఉన్న కనెక్షన్లు 2,240
- 2024 నాటికి 14,331 కనెక్షన్లు లక్ష్యం
- ప్రతి వ్యక్తికి సగటున 55 లీటర్ల నీరందించాలని ప్రణాళిక
- ఒకేసారి ఉచితంగా ఇన్ని కుళాయిలివ్వడం నీటి విప్లవమే!



పైపులైన్లు వేయడానికి గుంతలు తీస్తున్న పొక్లెయిన్



గాదెపాలెంలో జలజీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పైపులైన్ల పనులు



గుంతల్లో పైపులైన్లు వేస్తున్న వర్కర్లు

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కొత్తపట్నం మండలానికి కూడా ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. ఒక్కో వ్యక్తికి 55 లీటర్ల నీరివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొత్తపట్నం మండలంలో 15 పంచాయతీలకు గానూ 61 పనులు మంజూరయ్యాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఆయన ప్రోత్సాహంతో ప్రతిపాదనలు పంపడంతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా మండలానికి రూ.18.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రతి ఇంటికి నీటి కుళాయి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు పంచాయతీల్లో పనులు వేగంగా జరుగుతున్నాయి. అంతేగాకుండా ఓవర్‌హెడ్ ట్యాంకులు కూడా 15 మంజూరయ్యాయి. ప్రధానంగా గిరిజన కాలనీలకు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చే ప్రక్రియ వేగంగా జరగాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

14,331 గృహాలకు నీటి కుళాయిలు...

మండలంలోని 15 పంచాయతీల్లో 19 వేల గృహాలున్నాయి. ఒక్కో గృహానికి ఒక కుళాయి ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసి పనులు జరుగుతున్నాయి. 2019 ఏడాదికి ముందు మండలంలో 2,240 కుళాయిలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 నాటికి 14,331 కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటి కోసం రూ.18.70 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో పనులు పూర్తి కాగా, కొన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. వీటితో పాటు జగనన్న కాలనీలకు 931 కనెక్షన్లు ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసింది.

గృహాలకు ఉచితంగా ట్యాప్‌లు...

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చే ఏర్పాటును ప్రభుత్వం కల్పించింది. దీంతో ప్రతి ఇంటికి ఒక కుళాయి ఇచ్చి 55 లీటర్ల నీరివ్వడానికి 15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి పైపులైను వేసి కుళాయిలు ఇవ్వడానికి పనులు ప్రారంభించారు. ఇంటి యజమాని ఒక రూపాయి ఖర్చు పెట్టకుండా నేరుగా ఇంటిలోకి నీరు చేరే విధంగా పథకం మంజూరు చేశారు. ఇప్పటికే ఈతముక్కల, గాదెపాలెం, రాజుపాలెంలో పనులు పూర్తి చేశారు. మిగతా పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి.

మహిళలకు శ్రమ తప్పిపోయింది



ప్రతి ఇంట్లో ప్రతిరోజూ నీరు కావాలి. నీటి కోసం మహిళలు ఎన్నో ఇబ్బందులు, కష్టాలు పడేవారు. మండలంలో 70 వేల మంది జనాభాకు నీటి సమస్యకు ప్రస్తుతం శాశ్వత పరిష్కారం లభించినట్లయింది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రూ.18.70 కోట్లు మంజూరు చేయించారు. ఇది చిన్న సమస్య కాదు. ప్రతి ఇంటికి మేలు చేసినట్లే. మహిళలంతా బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– సైకం లక్ష్మీశారద, జెడ్పీటీసీ సభ్యురాలు

పనులు వేగంగా జరుగుతున్నాయి



మండలానికి 61 వర్కులకుగానూ రూ.18.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే గాదెపాలెం, రాజుపాలెం, ఈతముక్కల ప్రాంతాల్లో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం 20 వర్కులకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. 5 వర్కులకు అగ్రిమెంట్ అయ్యాయి. కొత్తగా 16 వర్కులు మంజూరయ్యాయి. జగనన్న కాలనీలకు 12 వర్కులు మంజూరయ్యాయి. 15 ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులను కూడా త్వరలో ప్రారంభిస్తాం. మార్చి నెలాఖరుకు మూడు వంతులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ప్రజల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కొత్తపట్నం మండలంలోని 15 పంచాయతీల్లో ప్రతి కుటుంబానికి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం. వారి దాహార్తి తీర్చేందుకు ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతిపాదనలు పంపించాం. రూ.18.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి అక్కచెల్లెమ్మలు నీటి కోసం బిందెలతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చూస్తాం. కనీసం బజారులోని కుళాయిల దగ్గర నిలబడాల్సిన అవసరం కూడా ఉండదు. నేరుగా ఇంట్లోకే నీరు చేరుతుంది. నిధులు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎన్నో ఏళ్ల నుంచి వెంటాడుతున్న నీటి సమస్యను పరిష్కరిస్తున్నాం.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే, ఒంగోలు

మండలంలో ప్రధాన సమస్య పరిష్కారం



నేను మండలంలో పర్యటించినప్పుడు అక్కచెల్లెమ్మలు తాగునీరు లేవని, కుళాయిలు ఇవ్వాలని అడిగేవారు. కుళాయి కనెక్షన్లకు నగదు చెల్లిస్తామన్నా కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి పంచాయతీ తీర్మానాలు, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలని ఎన్నో అడ్డంకులు చెప్పే వారు. అయితే, ఇప్పుడు అటువంటివేమీ లేకుండా నేరుగా ఉచితంగా కనెక్షన్ ఇచ్చే స్కీమ్‌ను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తీసుకొచ్చారు. అందరూ బాలినేనికి కృతజ్ఞతలు తెలపాలి.

– లంకపోతు అంజిరెడ్డి, ఎంపీపీ, కొత్తపట్నం

బ్రిడ్జి పనులను పరిశీలించిన ప్రణీత్‌రెడ్డి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ప్రణీత్‌రెడ్డి

కొత్తపట్నం: బకింగ్ హాం బ్రిడ్జి నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అక్కడున్న సూపర్‌వైజర్ అశోక్‌తో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజుల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తారు, ఎన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతానికి అనుకున్న పనులన్నీ పూర్తయ్యాయని, త్వరలో బ్రిడ్జిని ప్రారంభించుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం అదనంగా 40 ఎంఎం మెటల్ రెండో లేయర్ వేస్తున్నామని, 15 రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. లోడు లారీలకు ఇబ్బంది లేకుండా రెండో లేయర్ వేయమని కాంట్రాక్టర్ చెప్పడంతో రెండో లేయర్ వేస్తున్నామన్నారు. ఆ తర్వాత బాగా వాహనాలు తొక్కి సింక్ అయిన తర్వాత అప్పుడు తారు రోడ్డు వేస్తామని వివరించారు.

రామచంద్రరావు మృతదేహానికి బాలినేని నివాళి



కఠారి రామచంద్రరావు (ఫైల్)



రామచంద్రరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సబర్బన్: యాదవ మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు, యాదవ సంఘ రాష్ట్ర నాయకుడు కఠారి రామచంద్రరావు శనివారం రాత్రి మృతి చెందడంతో పలువురు ప్రముఖులు ఆయన మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మరాఠిపాలెంలోని రామచంద్రరావు నివాసంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామచంద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమాజానికి, యాదవులకు రామచంద్రరావు చేసిన సేవలను కొనియాడారు. యాదవ ప్రముఖులు కూడా రామచంద్రరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు(చంద్రం మాస్టారు), యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, పలువురు నాయకులు ఉన్నారు.

ఆకట్టుకున్న నిర్విరామ సంగీత కార్యక్రమం

ఒంగోలు టౌన్: నగరంలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్విరామ భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ఈ సంగీత కార్యక్రమం.. రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. శ్రీ జై శాంభవి భక్త బృందం అధ్యక్షుడు ఎస్.కృష్ణస్వామి నేతృత్వంలోని బృందం ఆలపించిన కీర్తనలు, భక్తి గీతాలు భక్తులను పారవశ్యంలో ముంచెత్తాయి. హిందూ ధర్మాన్ని, సనాతన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా రెండేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 107 దేవాలయాల్లో నిర్విరామ భక్తి గీతాలు ఆలపించారు. 108వ కార్యక్రమంగా ఒంగోలు నగరంలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ అపురూపమైన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఈదుపల్లి గుర్నాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్బాబు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ స్వామి బృందాన్ని ఘనంగా సత్కరించారు.



కృష్ణస్వామిని సత్కరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

కోతకు సిద్ధమైన వరి



బొద్దులూరివారిపాలెంలో కోతకొచ్చిన వరి పైరు

- రైతుల మోముల్లో ఆనందం

ఒంగోలు రూరల్: మండలంలోని ఉలిచి చెక్‌డ్యాం కింద సాగుచేసిన వరి పంట కొంత పొట్ట దశకు రాగా, మరికొంత కోతకు సిద్ధమైంది. దీంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. మండలంలోని చేజర్ల, కరవది, ఉలిచి, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు గ్రామాల్లో వేసిన వరి మంచి దిగుబడులు ఇచ్చేలా ఉందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు ఆర్‌బీకేలకు ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు ఆర్‌బీకేల సిబ్బంది ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలను రైతులకు తెలిపారు. ఏయే తెగుళ్లకు ఏయే మందులు వాడాలనే దానిపై రైతుల వద్ద ఉన్న భూసార పరీక్షల నివేదికల ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏ రైతు ఏ ఎరువులు వాడాలి, సూక్ష్మధాతు లోపాలు కలిగిన పొలాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై రైతులను అప్రమత్తం చేశారు. తెల్ల దోమను పూర్తిగా నివారించడంలో సఫలీకృతమయ్యారు. కాండం రసం పీల్చే పురుగుల నివారణకు తగు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా గత సంవత్సరం కంటే అధిక దిగుబడితో పాటు అధిక ధర పలుకుతుందని రైతులు తెలిపారు. రైతు పరిశోధన సంస్థ వారు నేల స్వభావాన్ని బట్టి అందజేసిన వంగడాలు 94, 92, 74, 72, నెల్లూరు సన్నాలు, బీపీటీలు తదితర మేలు జాతి వంగడాలతో నారుమళ్లు పెంచి నాట్లు వేయడంతో మంచి దిగుబడులు ఆశిస్తున్నారు. గత సంవత్సరం మాగాణి రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తేమ శాతాన్ని గుర్తించి అమ్మకాలు జరగడంతో గిట్టుబాటు ధర లభించింది. ఈ ఏడాది కూడా మంచి దిగుబడులు లభిస్తాయని రైతులు ఆశిస్తున్నారు. గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతంలో 900 ఎకరాల్లో, చేజర్ల ప్రాంతంలో మరో 800 ఎకరాలు, దశరాజుపల్లి ప్రాంతంలో 300 ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలకు సిద్ధం కావడంతో గిట్టుబాటు ధర కూడా లభిస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.



చేజర్లలో ఏపుగా ఎదిగిన వరి

విశ్వనాథ్, వాణి జయరాంలకు నివాళి



విశ్వనాథ్,వాణి జయరాంలకు నివాళులర్పిస్తున్న కళా సంఘాలు

ఒంగోలు టౌన్: ఇటీవల మృతి చెందిన ప్రసిద్ధ సినీ దర్శకులు కాశీనాథుని విశ్వనాథ్, ప్రసిద్ధ గాయకురాలు వాణి జయరాంలకు నగరానికి చెందిన వివిధ కళాకారుల సంఘాలు ఘనంగా నివాళి అర్పించాయి. విశ్వనాథ్, వాణి జయరాం ఇద్దరూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. భారతీయ సినిమా రంగానికి, కళాకారులకు వారి మృతి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేణుకొండ సుబ్బయ్య, గుర్రం కృష్ణ, పాడిబండ్ల ఆనంద్‌రావు, లక్ష్మీ తులసి, ఆలూరి శ్రీదేవి, సింగయ్య, చల్లా నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చీమకుర్తి: ఒంగోలులోని పేర్నమిట్టలో శ్రీప్రతిభ జూనియర్ కాలేజీ, గురుదత్త ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా కాలేజీ వ్యవస్థాపకుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో కూడా నైపుణ్యాలు ప్రదర్శించాలన్నారు.



గుర్తు తెలియని కారు ఢీకొని యువకునికి గాయాలు



గాయపడిన ప్రశాంత్

ఒంగోలు టౌన్: గుర్తు తెలియని కారు ఢీకొని ఓ యువకునికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేదరమెట్ల గ్రామానికి చెందిన బూదరాజు ప్రశాంత్‌ను గుర్తుతెలియని కారు ఢీకొంది. మంగమూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న పెట్రోలు బంకు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. కారును ఆపకుండా వెళ్లిపోగా, ప్రశాంత్‌కు తీవ్ర గాయాలై చెవుల నుంచి రక్తస్రావమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రుడిని జీజీహెచ్‌కి తరలించారు. ప్రశాంత్ స్పృహలో లేడు. ప్రస్తుతానికి అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని చికిత్స చేస్తున్న వైద్యులు తెలిపారు.

శాసనమండలి వేదికగా పీడీఎఫ్ ప్రజాపోరాటం



సభలో ప్రసంగిస్తున్న లక్ష్మణరావు

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాసన మండలి వేదికగా పీడీఎఫ్ సభ్యులు పనిచేస్తున్నారని ఆ పార్టీ తరఫున తూర్పు రాయలసీమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి.బాబురెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సంఘీభావ సభ నిర్వహించారు. సభకు జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు టి.గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి వేదిక మీదకు నాయకులను ఆహ్వానించారు. ముఖ్య అతిథులుగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ హాజరయ్యారు. పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతు తెలిపిన వివిధ ప్రజా సంఘాల నాయకులు పీడీఎఫ్ తరఫున పోటీచేస్తున్న పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో 70 ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

1. యిందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రకాశం జిల్లా, Chimakurthy మండలం, కాండూరి అగ్రహారం, చెందిన భూమి వివాదంలో ఉండి ఉన్నది. Boddu Rama Rao మరియు G.P.A. G.C. Rama Swamy అను వారలు మహారాజశ్రీ శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కోర్టులో, ఒంగోలు నందు Appeal Petition No.Rc.No.D/573/2021 (Appeal Petition filed under Section 5(5) of A.P. Rights in Land and Pattadar Pass Books Act, 1971 R/W Rule 21 of A.P. Rights in Land and Pattadar Pass Books Rules, 1989) పట్టాదార్ పాస్ పుస్తకములు రద్దు కొరకు దాఖలు చేసి ఉన్నారు మరియు పట్టాదార్ పాస్ పుస్తకములు తీసుకొనుటకు గాను పై నెంబర్ అప్పీల్ దాఖలు చేసి ఉన్నారు. వాటి వివరాలను షెడ్యూల్‌లో చూపడమైనది. సదరు అప్పీల్ పిటీషన్ ఆర్డర్స్ కై వుంది ఉన్నది. తమ పేరున షెడ్యూల్ దాఖలా భూమి (క్రింద తెల్పిన సర్వే నంబర్లలోని ac. 1.19 cents మరియు ac. 0.26 cents = వెరసి మొత్తం ac. 1.45 cents) ఎవరైనా కొన్నను, అమ్మినను మా క్లైంట్స్ తీసుకొనబోయే సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని గుర్తెరిగి ప్రవర్తించేది. ఈ విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపవలెను. లేని యెడల పై కేసును విచారించి తీర్మానము చేయబడును.

షెడ్యూలు

Chimakurthy Mandal - Kanduruvari Agraharam Village :

(a) S.No.19/3 - Ac. 0.26 Cents Well (Bavi)

1. Kanduri Venkata Pardha Saradhi Khata No. 49	0.07 Cents
2. Kanduri Venkata Sudharsanam Babu Khata No.51	0.06 cents
3. Pilli Anjaiah, Khata No.166	0.02 cents
4. Pilli Kotaiah, Khata No.169	0.03 cents
5. Pilli Subbarayudu, Khata No.170	0.01 cents
6. Pilli Papaiah, Khata No.171	0.03 cents
7. Pilli Tirupathaiah, Khata No.173	0.01 cents
8. Mandula Lakshmamma, Khata No.201	0.03 cents
	0.26 cents

N.B:- We have entitle of 1/4th share in above said S.No.19/3, an extent of ac. 0.26 cents (as per Regd. Sale Deed Doc. No.927/1968, dt.11.06.1968, Zerox copy of document enclosed).

As per 1B

Khata No. 49	Dispute Survey Number
Khata No.51	- do -
Khata No.166	Dispute Survey Number
Khata No.169	- do -
Khata No.170	- do -
Khata No.173	- do -
Khata No.201	- do -

S.No.19/5 - Ac.1.19 cents agriculture land.

ఒంగోలు.
తే.05.02.2023ది

ఇట్లు: దేగల రాజేంద్రప్రసాద్
పిటీషనర్ తరఫు న్యాయవాది, సెల్: 90008 66106